



# సాయి సూర్య

తెలుగు దిన పత్రిక

www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229



రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక

మీలో చక్కని వేదికగా నిలుస్తోంది.
ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని
చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
99493 60937,
9100900931



ప్రచురణ: హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 23 ఎడిటర్ : పాలగోని రాజేష్ బుధవారం 19 -03-2025 పేజీలు : 8 వెల : 4-00


# కుంభమేళా విజయవంతం సరే..



- తొక్కిసలాట మృతులకు కనీసం నివాళి ఏదీ
- ప్రధాని మోడీపై విపక్షనేత రాహుల్ విసుర్లు

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్‌ఎన్‌ఎ): మహాకుంభమేళ విజయవంతం కావడంపై ప్రధాని మోదీ పార్లమెంటులో స్పందించినా... తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఆయన నివాళులర్పించ లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత

మిగతా 2వ పేజీలో

## స్టాక్ మార్కెట్‌లో పాజిటివ్ సెంటిమెంట్



### లాభాలతో ముగిసిన మార్కెట్లు

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్‌ఎన్‌ఎ): భారత వాణిజ్య లోటు మూడేళ్ల కనిష్టానికి చేరడం, వరుస నష్టాల నేపథ్యంలో చాలా స్టాక్స్ ఆకర్షణీయంగా మారడంతో మదుపర్లు మళ్లీ కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు.

## ఔరంగజేబ్ సమాధి తొలగింపునకు డిమాండ్

నాగపూర్‌లో హింసాత్మక ఘటనలు- పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ అమలు



# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

ఆదినుంచి దళితులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ

దళితులను ముందువరసలో నిలిపింది కాంగ్రెస్ పార్టీయే

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,సాయి సూర్య

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా

మిగతా 2లో

## నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి



అంతకు ముందే కేబినేట్‌లో చర్చించి ఆమోదం

## ప్రశ్నోత్తరాలపై సమాధానం చెప్పలేక పారిపోతున్న కాంగ్రెస్

- భూములు తాకట్టుపెట్టి వేలకోట్లు అప్పు
- సభా హక్కులను కాపాడే బాధ్యత స్పీకర్‌దే
- ఆంధ్రా జలదోపిడీతో నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు నీటి సమస్య
- చిట్‌చాట్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్,సాయి సూర్య


శాసనసభలో ప్రశ్నోత్తరాలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అందుకే ఈరోజు కీలకమైన ప్రశ్నోత్తరాలు ఉన్నాయని సమాధానం చెప్పలేక రద్దు చేసుకుందని విమర్శించారు. దీనిపైన స్పీకర్‌కు, కార్యదర్శికి అభ్యంతరం చెప్పామని హరీశ్‌రావు తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో హరీశ్‌రావు చిట్‌చాట్ చేశారు. ఈ ప్రభుత్వం హెచ్‌ఎండీఏ భూములు తాకట్టు పెట్టి 20 వేల కోట్లు అప్పు తెస్తున్నారు. టీజీఐఐసీ 10 వేల కోట్లు, హెచ్‌ఎండీఏ ఆస్తులు కుదబెట్టి 20 వేల కోట్లు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ 10 వేల కోట్లు, జీహెచ్‌ఎంసీ ఆస్తులను తాకట్టు పెట్టి 10 వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు సిద్ధమైంది. మొత్తం 50 వేల కోట్లను అప్పు చేస్తుంది. మా ప్రశ్నలపై సమాధానం చెప్పలేక మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుంది. సభ్యుల హక్కులను స్పీకర్ కాపాడాలి. జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టడం లేదు అని హరీశ్‌రావు తెలిపారు. ఆంధ్ర జలదోపిడీ కారణంగా మహబూబ్ నగర్,నల్లగొండలో పంటలు

మిగతా 2లో

యాదగిరిగుట్టకు

# ధర్మకర్తల మండలి

18మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు
అసెంబ్లీలో మంత్రి కొండా సురేఖ వెల్లడి



## సునీత విజయాల పట్ల

# భారత్ గర్విస్తోంది

నీవు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాం

భారత్‌లో పర్యటించాలని ఆకాంక్షిస్తున్నాం

సునీతా విలియమ్స్‌కు మోడీ లేఖ

న్యూఢిల్లీ,సాయి సూర్య

భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కొన్ని నెలల ఎదురుచూపుల తర్వాత పుడమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం అని సునీతకు లేఖ రాశారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని, ఆరోగ్యంగా ఉండాలని మోదీ ఆకాంక్షించారు. సునీత సాధించిన



విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు

- మిగతా 2లో పేజిలో

## పదేళ్లుగా

# దేవాదుల నిర్లక్ష్యం

- చర్చల లేని రోజే కెసిఆర్ వచ్చి వెళతారు
- మామూలు రోజుల్లో సభను ఎదుర్కొనే ధైర్యం లేదు
- దేవాదుల పంపులను ప్రారంభించిన మంత్రులు



వరంగల్‌సాయి సూర్య

గత పదేళ్లు దేవాదులను నిర్లక్ష్యం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ ఉన్నప్పుడే దేవాదుల ఫేజ్ 1 పూర్తయిందన్నారు. మూడో ఫేజ్ పను లను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేవాదుల పంప్ హౌస్ ఫేజ్ 3 లో భాగంగా నిర్మించిన మోటార్లను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆన్ చేశారు.

మిగతా 2లో



## మూసీ పునరుజ్జీవనంపై వెనకడుగు లేదు

మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం

హైదరాబాద్‌సాయి సూర్య మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఎవరికైనా అపోహలుంటే నివృత్తి చేస్తామని చెప్పారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమంపై శాసనమండలిలో సభ్యులు మహేశ్ కుమార్ గౌడ్, టి.జీవన్ రెడ్డి, బల్మూరి వెంకట్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు.

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
బుధవారం 19 మార్చి 2025

## ఔరంగజేబ్ సమాధి తొలగింపునకు డిమాండ్

ముంబై,మార్చి18 మహారాష్ట్రలోని శంభాజీ నగర్‌లోని మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్‌ల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం అర్ధరాత్రి నాగ్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో వీటిని అదుపు చేసేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తుంది. నాగ్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో పోలీసులు కర్ఫ్యూ విధించారు. ఈమేరకు స్థానిక పోలీస్ కమిషనర్ రవీందర్‌కుమార్ సింగల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు- ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాగ్‌పూర్ నగర పరిధిలోని కొత్వాలి, గణేశ్‌పేట్, లకడ్‌గంజ్, పచ్పావులి, శాంతినగర్, సక్కర్‌దర, నందన్‌వన్, ఇమామ్వాడ, యశోధర నగర్, కపిల్‌నగర్‌లలో కర్ఫ్యూ విధించారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. ఎవరైనా కర్ఫ్యూ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక, నాగ్‌పూర్‌లోని హంసపురి ప్రాంతంలో రెండు వర్గాల మధ్య అర్ధరాత్రి ఘర్షణలు జరిగాయి. కొందరు దుండగులు వాహనాలకు నిప్పంటించడంతో పాటు- ఆ ప్రాంతంలోని నివాసాలు, షాపులను ధ్వంసం చేశారు. ఈ ఘటనల్లో దాదాపు 20 మంది గాయపడ్డారు. వారిలో 15 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. ఘర్షణకు కారకులైన 17 మందిని అదుపులోకి తీసుకున్నట్లు- అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు.

## కుంభమేళా విజయవంతం సరే..

(మొదటి పేజి (తరువాయి)

రాహుల్ గాంధీ విమర్శించారు. మంగళవారం లోక్ సభలో వెలుపల ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రయాగ్ రాజ్ వేదికగా నిర్వహించిన మహాకుంభమేళ విజయవంతం కావడంపై ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారని చెప్పారు.కానీ ఈ ప్రయాగ్ రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించారని... వారికి ప్రధాని మోదీ నివాళు లర్పించలేదని చెప్పారు. కుంభమేళా అంటే.. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయమని రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఆ క్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యల తో తాము పూర్తిగా ఏకభవిస్తామన్నారు. కానీ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఘనంగా నివాళులు అర్పించక పోవడం పట్ల ఆయన తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే ఈ కుంభమేళ కారణంగా తమకు ఉపాధి లభిస్తోందని యువత ఆశించిదని చెప్పారు.

## స్టాక్ మార్కెట్‌లో పాజిటివ్ సెంటిమెంట్

(మొదటి పేజి (తరువాయి)

సోమవారం లాభాలు అందుకున్న దేశీయ సూచీలు మంగళవారం కూడా అదే జోరును చూపించాయి. చైనా తీసుకుంటున్న ఉద్దీపన చర్యలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరచడంతో ఆసియా మార్కెట్లు భారీ లాభాలను ఆర్జించాయి. అదే బాటలో సెన్సెక్స్, నిఫ్టీ కూడా కదలాడాయి.సోమవారం ముగింపుతో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 500 పాయింట్ల లాభంతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా మెటల్, ఐటీ-, ఫైనాన్స్ స్టాక్స్ భారీ లాభాలను ఆర్జించాయి. దీంతో సెన్సెక్స్ చాలా రోజుల తర్వాత 75 వేలను దాటింది. చివరకు సెన్సెక్స్ 1,131 పాయింట్ల లాభంతో 75, 301 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 3251 పాయింట్ల లాభంతో 22, 834 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో పేటీ-ఎమ్, పీబీ ఫిన్-టె-క్, జొమాటో, ఐఐఎఫ్ఎల్ షేర్లు లాభాలను ఆర్జించాయి. ఛంబల్ ఫెర్టిలైజర్స్, బజాజ్ ఫిన్‌సెర్వ్, భారతీ ఎయిర్-టె-ల్, పిడిలైట్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1055 పాయింట్లు- ఎగబాకింది. బ్యాంక్ నిఫ్టీ 960 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.57 గా ఉంది.

## డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్,మార్చి18 భాజపా ఎంపీ డీకే అరుణ ఇంట్లో చొరబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని దిల్లీకి చెందిన అక్రమ్‌గా గుర్తించారు. అతడిని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కు




మార్, జూబ్లీహిల్స్ పోలీసులు విచారి స్తున్నారు. ఎంపీ ఇం ట్లోకి చొరబడేందుకు గల కారణాలను తెలుసుకుంటు-న్నారు. అక్రమ్ గతంలో హైదరాబాద్‌లోని పాతబస్తీ, దిల్లీలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు- సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీపీ సీవీ ఆనంద్ సోమవారం ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లోని ఎంపీ నివాసంలోకి నిందితుడు ముసుగు ధరించి ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించాడు. సీసీ కెమెరా వైర్లను కత్తిరించి, సుమారు గంట పాటు- ఇంట్లో తిరిగి అక్కడి నుంచి జారుకొన్నాడు. వంట గది కిటికీ గ్రిల్ తొలగించడం గమనించారు. దీనిపై ఎంపీ డ్రైవర్ లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

హైదరాబాద్,మార్చి18 తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బుధవారం ఉదయం 11.14 గంటలకు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ముందుగా కేబినేట్ ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. అనంతరం బడ్జెట్ కాపీలతో భట్టి విక్రమార్క అసెంబ్లీకి చేరుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్ కావడం విశేషం. బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజి (తరువాయి)

ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ- వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నిం చింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. ఇక, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు నా కృతజ్ఞతలు. నేను ముఖ్యమంత్రిగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషం' అని అన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ సిఫార్సు చేసిన ప్రకారమే 3 గ్రూపులతో ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించింది. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం జనాభాలో వీరి జనాభా 3.288గా ఉంది. వీరికి 1 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. మధ్యస్థంగా లబ్ధిపొందిన 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు. వీరి జనాభా 62.748గా ఉంది. వీరికి 9శాతం రిజర్వేషన్ కల్పించారు. కాస్త మెరుగైన ప్రయోజనాలు పొందిన 26 కులాలను గ్రూప్ 3లో వేశారు. వీరి జనాభా 33.963గా ఉంది. వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఏ,బీ,సీ,డీ, కేటగిరీలుగా ఎస్సీ వర్గీకరణను చేసే అవకాశం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వం.. కమిషన్ సిఫార్సుతో పాటు- ఎంపిరికల్ డేటాను దృష్టిలో పెట్టు-కుని న్యాయపర చిక్కులు రాకుండా ఉండేలా బిల్లును సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 1,38,78,078. వీరిలో మాదిగలు 67,02,609 ఉండగా.. మాలలు 55,70,244 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం మాలల జనాభా కంటే మాదిగల జనాభా 11.3 లక్షలు ఎక్కువ. ఎస్సీల్లో కేవలం ఈ రెండు కులాల జనాభానే 80 శాతం వరకు ఉంటు-ందని ఓ అంచనా. అందరికీ కలిపి 15 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ మొత్తం కోటాలో మాలలే ఎక్కువ లాభం పొందుతున్నారనే గొడవ దశాబ్దాల క్రితమే మొదలైంది. 1972 నుంచి మాదిగ వర్గానికి చెందిన నేతలు ముఖ్యమంత్రుల్ని కలుస్తూ వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు.

# ప్రశ్నోత్తరాలపై సమాధానం చెప్పలేక పారిపోతున్న కాంగ్రెస్

ఎండిపోతున్నాయి . రైతు భరోసా వానకాలం వేశారా లేదా అని ప్రశ్న వేస్తే దానిని రద్దు చేశారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్ల తక్కువ ధరకు రైతులు పంటలు అమ్ముకొని నష్టపోయారు. మా హయంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ప్రస్తుత ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. మేము 54 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వరి ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం అన్నారు. కొన్నది 24 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ధాన్యం కొనుగోళ్లలో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. యాసంగి రైతు భరోసా ఇంతవరకు ఇవ్వలేదు. వరంగల్ జిల్లాలో దేవాదుల కింద పంటలు ఎండిపోతున్నాయి. మల్లన్న సాగర్, దుబ్బాకలో పంటలు ఎండిపోతు న్నాయి. వీటి పైన మేము ప్రశ్నలు వేస్తే ఈరోజు ప్రశ్నోత్తరాలు రద్దు చేశారు. రైతు రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ పూర్తయిం దని ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే చెబుతున్నారు, కానీ ఇంకా 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. నిజామాబాద్ జిల్లాలో రుణమాఫీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నా నియోజకవర్గంలో రైతు భరోసా క్రింద రైతులకు 39 కోట్లు మాత్రమే వేశారు. ఇంకా 37 కోట్లు రావాల్సింది. కాంగ్రెస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక హడావిడిగా ప్రశ్నోత్తరాలను ఎత్తివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడానికి భయపడుతుంది. సభ్యులకు తెలియకుండా ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నలు మారుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. నిన్న రెండు ముఖ్యమైన ప్రశ్నలు ఉండేవి. హెచ్ఎండీఏ భూములు తాకట్టు పెట్టి అప్పు తెచ్చిన విషయం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచీ అప్పులు తెచ్చిన విషయం. ఇవి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతాయని ఈరోజు ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. ఎంఐఎం వారి ప్రశ్న కూడా ఒకటి ఉండేది. మా మూడవ ప్రశ్న "యాసంగి పంటలు ఎండిపోతున్నాయి" అనే అంశంపై మా కేటీఆర్ ప్రశ్న ఉండేది. శాసన సభ వ్యవహారల మంత్రిని అడుగుతున్నా, ప్రశ్నోత్తరాలను ఎందుకు రద్దు చేశారు? ప్రభుత్వం మా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక హడావిడిగా ప్రశ్నోత్తరాలను రద్దు చేసింది. స్పీకర్‌తో నిన్ననే ఫోన్‌లో మాట్లాడాను. హడావుడిగా చేసి క్వశ్చన్ అవర్ లేకుండా చేశారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇలా రద్దు చేయడం ఏంటి? క్వశ్చన్ అవర్ మ్యాండేటరీ. జీరో అవర్ పెట్టకపోయినా, కనీసం క్వశ్చన్ అవర్ పెట్టాల్సిందే అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

(మొదటి పేజి (తరువాయి)

ఒక మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొంగులేటి.. గత ప్రభుత్వం కమిషన్ల కోసమే తాపత్రయపడింది కానీ.. ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. సాగునీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణమని విమర్శిం చారు. మిషన్ భగీరథ పేరుతో 39 వేల కోట్లు- ఖర్చు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సమాధానం చెప్పాల్సి ఉంటది కాబట్టే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదన్నారు. చర్చ లేనిరోజునే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ఎద్దేవా వేశారు పొంగు లేటి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీని ఫేజ్ చేసే దమ్ములేదు.. అందుకే చర్చ లేని సమయంలో.. బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఇవాళ రాష్ట్రంలో ఉన్న నీటి ఎద్దడికి కారణం కేసీఆరే.. కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది.. కమిషన్ల కోసం శిలా ఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారు.. దేవాదులను నిర్లక్ష్యం చేశారు ఆరోపించారు. ఇక, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనుకున్న దాని కంటే రైతులు ఎక్కువ సాగు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల పంటల ఎండిపోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నాం.. బడ్జెట్ సమావేశాల కంటే రైతుల సమస్యలే ముఖ్యమని వచ్చాం.. ఎంత పొద్దుపోయినా పంపు ఆన్ చేసి వెళతాం.. నాటి ప్రభుత్వం దేవాదుల పూర్తి చేసి ఉంట్గే ÷తులకు ఈ స్థితి వచ్చేది కాదు అన్నారు.

## యాదగిరిగుట్టకు ధర్మకర్తల మండలి

హైదరాబాద్,మార్చి18 యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ.. 18 మంది సభ్యులతో వైటీ-డీ బోర్డు ఉంటుందని చెప్పారు. బోర్డు పదవీకాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు ఛైర్మన్, సభ్యులకు ఎలాంటి జీత భత్యాలు ఉండవన్నారు. వైటీడీ బోర్డు కూడా విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చన్నారు. దీనికి ఆ స్వేచ్ఛ ఉంటుందన్నారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద విద్యా సంస్థలను స్థాపించవచ్చని కూడా అన్నారు.

# ఢిల్లీ నుంచి ఎప్పుడొస్తారు

బొత్స. సుప్రీం కోర్టులో కేసు వేయడంతో ఈ నెల 9 నుంచి అటవీశాఖ సర్వే నిర్వహిస్తోందని.. మూడు నెలల్లోగా స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని గత ఏడాది డిసెంబర్‌లో సుప్రీం కోర్టు ఆదేశించిందని చెప్పారు. బుధవారం సుప్రీం కోర్టులో కొల్లేరు వ్యాజ్యంపై విచారణ జరగనుందని.. దీంతో అటవీ శాఖ సర్వే వల్ల నష్టపోతున్న రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ కారణంగా వారి డెలిగేషన్ వచ్చి కలుస్తారు -టైం ఇవ్వాలని బొత్స కోరారు. దీంతో ఢిల్లీ నుంచి రాగానే సమయం ఇస్తామని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. కాగా.. ఫొటో సెషన్ ముగించుకుని పవన్ లోపలికి వెళ్తున్న సమయంలో బొత్స సత్యనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీలు ఎదురొచ్చి మరీ డిప్యూటీ- సీఎంను కలిశారు. 'బాగున్నారా , ఆరోగ్యం ఎలా ఉంది' అంటూ పవన్‌ను బొత్స పలకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, బొత్స సత్యనారాయణ పరస్పరం కరచాలనం చేసుకున్నారు.

సునీత విజయాల పట్ల

## భారత్ గర్విస్తోంది

(మొదటి పేజి (తరువాయి)

గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. యూఎస్ పర్యట నకు వెళ్లినప్పుడు.. మీ గురించి అడిగి తెలుసుకున్నాను. మీరు వేలాది కి.మీ. దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుం టున్నాం. మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూ స్తున్నాం. తన కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల భారత్ సంతోషంగా ఉంటుందని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సునీతా విలియమ్స్, వ్యోమగామి బుచ్ విల్మోర్, మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు భారత కాల మా నం ప్రకారం బుధవారం తెల్లవారు జామున 3.27 గంటలకు పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన విషయం తెలిసిందే. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. వారం రోజులకే తిరిగి భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక
బుధవారం 19 మార్చి 2025

## చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యాన్లు అందజేత భవిష్యత్తులో మరిన్ని సేవలు

**- ఫౌండేషన్ నిర్వాహకులు హనుమంతు సాయి చంద్ర గౌడ్**



కొండమల్లేపల్లి సాయి సూర్య న్యూస్ మార్చి18 చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి పట్టణంలోని బిసి బాలికల గురుకుల పాఠశాలకు మంగళవారం ఫౌండేషన్ నిర్వాహకులు హనుమంతు సాయి చంద్ర గౌడ్ చేతుల మీదుగా ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా సాయిచంద్ర గౌడ్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని విద్యార్థినిల సౌకర్యార్థం నాలుగు ఫ్యాన్లు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పదవ తరగతి విద్యార్థినిలు జరగబోయే పరీక్షల్లో మంచి ప్రతిభను కనబరిచి ఉత్తీర్ణతను సాధించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. తమ వంతు సహకారంగా పాఠశాలలో ఫ్యాన్లు అందజేసిన సాయి చంద్ర గౌడ్ కు పాఠశాల ప్రిన్సిపల్ మల్లేశ్వరి శాలువా, బొకే అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పున్న మల్లేశ్వరి, చంద్రన్న ఫౌండేషన్ సభ్యులు కొమ్మినేని ఆంజనేయులు, గిరి, సైదులు తో పాటు ఉపాధ్యాయినిలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు

## లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



ఇబ్రహీంపట్నం,సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి18
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా మంగళవారం గ్రామపంచాయతీ వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ డైరెక్టర్ ఉష హాజరై మాట్లాడుతూ లీడింగ్ ఎలక్ట్రానిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను సద్విని యోగం చేసుకోవాలన్నారు. యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ యొక్క మెగా జాబ్ మేళాను నిర్వహించడం అభినందనీయమన్నారు.మెగా జాబ్ మేళాలో 68 దరఖాస్తులు రాగా 52 మంది స్పాట్ సెలక్షన్ కావడం జరిగిందని మిగతా వారికి అతి త్వరలోనే జాబ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సెలక్షన్ అయిన వారికి వారం రోజుల్లో పోస్టింగ్ ఇవ్వనున్నారని దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి,మొబైల్ మేనేజర్ భారతి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టలయాదగిరి, సీనియర్ నాయకులు జంగయ్య, ఆర్క సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులు వేతనాలు వెంటనే ఇప్పించాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్**



మంచాల, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 18 మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల 8 నెలల పెండింగ్ బిల్లులు, 3నెలల వేతనాలు వెంటనే ఇప్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల పెండింగ్ బిల్లులు వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరుతూ నేడు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు బిల్లులు, వేతనాలు రాక కార్మికులు అనేక ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. 8 నెలల నుండి బిల్లులు, 3 నెలల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. పెండింగ్ బిల్లులు వేతనాల కోసం ధర్నాలు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇంకో నెల రోజుల్లో పాఠశాలలకు సెలవులు రానున్నాయని పాఠశాలలు ప్రారంభం నుండి ముగిసే వరకు బిల్లులు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పెండింగ్ లో ఉన్న బిల్లులు వేతనాలు ఇప్పించాలని కోరారు.
వెంటనే పెండింగ్ బిల్లులు వేతనాలు ఇవ్వకపోతే ఈ నెల 24 వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో వంట బందు పెట్టి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు జయమ్మ,సావిత్రి,రజిత, శివ రాణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగుల ఉపాధికి గొప్ప వరం

**టీపీసీసీ నాయకులు బట్టు జగన్ యాదవ్**



నాంపల్లి మార్చి 18( సాయి సూర్య)ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికసం పథకాన్ని ప్రారంభించడం హర్షనీయమని టిపిసిసి నాయకులు బట్టు జగన్ యాదవ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకంతో నిరుద్యోగులు ఆర్థికంగా నిలదొక్కుకొని స్వయం ఉపాధి పొందేందుకు మార్గం ఏర్పడుతుందని ఈ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 5 వేల మంది చొప్పున రాష్ట్రంలో 5 లక్షల మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు సుమారు 6 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఒక్కో లబ్ధిదారునికి 4 లక్షల వరకు రుణం మంజూరు చేసి 60-80 శాతం వరకూ రాయితీ ఇవ్వడం సంతోషకరం అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మరొసారి నిరూపితమైందన్నారు. రాజీవ్ యువ వికాస పథకం సోమవారం నుండి ఆన్లైన్ ప్రక్రియ మొదలైందని ఆసక్తి కలిగిన యువత ఆధార్ కార్డు, కాస్ట్ మరియు ఇన్కమ్ సర్టిఫికెట్ లు జత చెసి ఏప్రిల్ 5 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 6 నుండి మే 31 వరకు అప్లికేషన్ల వెరిఫికేషన్ చేసి అర్హులకు తెలంగాణా ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 రోజున మంజూరు పత్రాలను ప్రభుత్వం అందజేస్తుంది అన్నారు నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉపాధి పొదలని కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చండూర్ మార్చి 18 (సూర్య టుడే): చండూర్ పట్టణంలో శాసనసభ్యులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 5 మంది లబ్దిదారులకు 1,59,000 వచ్చిన చెక్కులను మంగళవారం రోజు లబ్దిరులకు గెస్ట్ హౌస్ దగ్గర అ%శీ%దించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, నల్లగంటి మల్లేష్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కోడి శ్రీనివాసులు, సంకోజు బ్రాహ్మం, గండూరి జనార్ధన్, భూతరాజు దశరథ, బెల్లంకొండ శేఖర్, ఐతరాజు మల్లేష్, బోడ వెంకటేశం, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు గొప్పవరం

**రాజీవ్ యువ వికాస పథకం సద్వినియోగం చేసుకోవాలి**

**ఎంపీడీవో నరేందర్ రెడ్డి**

యాచారం సూర్య న్యూస్ (మార్చి 17):.
తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించిందని తెలిపారు. ఈ పథకాన్ని గిరిజన నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు అందించాలని ప్రణాళిక ఆమోదించిందని తెలిపారు. అర్హత కలిగిన గిరిజన నిరుద్యోగులు ఆన్లైన్ ఫోటోలు ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుండి ఏప్రిల్ 5 వరకు వెబ్ సైడు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.

## డిఇఓ కార్యాలయం ముందు నిరసనప్రదర్శననుజయప్రదంచేయండి

**బక్కా శ్రీనివాస చారి టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు**



కొండమల్లేపల్లి సాయి సూర్య న్యూస్ మార్చి 18 2023 - 2024 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల ప్రశ్న పత్రాల ను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పటికైనా ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాస చారి డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ఒక సంవత్సరకాలం గడిచిపోయి మరల 10వ తరగతి పేపర్లు దిద్దే ప్రక్రియ ఆరంభం అవుతున్నప్పటికీ ఇంతవరకు రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా విద్యాధికారి కార్యాలయం ముందు ఈ నెల 20వ తేదీన టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేయబోతున్నామని ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు మరియు స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమం లో పాల్గొన్న ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సపావత్ భాను ప్రకాష్, మండల ఉపాధ్యక్షులు శ్రీదేవి, మండల ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ కోడి నరేందర్, విద్యార్థిని విద్యార్థులు మండల మహిళా కన్వీనర్ శోభారాణి, మండల కార్యకర్తలు నజీరుద్దీన్, నాగార్జున,సుధాకర్, డి కోటయ్య శంకరయ్య, మధుసూదన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

# పేదింటిలో మెరిసిన ఆణిముత్యాలు

**ఒకే కుటుంబంలో అన్నదమ్ములు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు**

**పేదరికం వారికి తలవంచింది... ఉన్నత ఉద్యోగాలు సాధించారు**

**ఆకలేస్తే అందరూ అన్నం కోసం ఎదురు చూస్తారు.. కానీ వీరు అక్షరాలు తింటూ ఉద్యోగం కోసం ఎదురు చూశారు**



కొండమల్లేపల్లి సాయి సూర్య న్యూస్ మార్చి 18 నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొలుముంతల్ పహాడ్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదయ్య- యాదమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో బొడ్డుపల్లి శివ కుమార్, బొడ్డుపల్లి చంద్రశేఖర్ కుమార్తె కళ్యాణి ఉన్నారు. కుమార్తె కళ్యాణికి రెండు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. శివకుమార్ ఒకటి నుండి 10వ తరగతి వరకు కొండమల్లేపల్లి పట్టణంలోని నాగార్జున గ్రామర్ స్కూల్లో చదివారు, ఇంటర్ నల్గొండ లోని నల్గొండ కళాశాలలో, డిగ్రీ నిజం కళాశాలలో పూర్తి చేశారు, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ లో ఉద్యోగం సాధించారు. చిన్న కుమారుడు చంద్రశేఖర్ కు నెల రోజుల క్రితం ఏఈ ఉద్యోగం వచ్చింది. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో చేరారు. ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఫలితాలలో హాస్టల్ వెల్ఫేర్ గ్రేట్ టు ఆఫీసర్గా శివకుమార్ నియామకమయ్యారు. కుమ్మరి యాదయ్య -యాదమ్మ కుటుంబం నిరుపేద కుటుంబం .రెండెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివించేవాడు. సంపాదన సరిపోక వ్యవసాయాన్ని పార్ట్ టైం గా చేస్తూ కొండమల్లేపల్లి పట్టణంలోని జ్ఞానోదయ ప్రింటింగ్ ప్రెస్ లో పనిచేసేవారు .పిల్లలను ప్రయోజకులు చేయాలనే తపన యాదయ్యలో ఆణువు అణువు ఉండేది, వారికోసం అహర్నిశలు కష్టపడి సంపాదించిన దానితో వారిని ఉన్నతమైన చదువులు చదివించారు. దురదృష్టవశాత్తు యాదయ్యకు డ్యూటీ కి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి కొన్ని నెలలు మంచానికే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితులలో కూడా పిల్లలిద్దరు మొక్కవోని ధైర్యంతో తల్లిదండ్రుల కష్టాన్ని నెమరు వేసుకుంటూ ఇద్దరు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగులు సంపాదించారు. ఆకలేస్తే అందరూ అన్నం కోసం ఎదురుచూస్తారు కానీ ఈ అన్నదమ్ములు ఇద్దరు ఆకలేస్తే అక్షరాలను తింటూ ఉద్యోగమే లక్ష్యంగా మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్లి అనుకున్నది సాధించారు. తల్లిదండ్రుల కష్టం కళ్లారా చూసిన వారు కూడా చిన్ననాటి నుండే తల్లిదండ్రుల కష్టంలో పాలుపంచుకొని ముందు కెళ్లారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చదివేటప్పుడు అన్నదమ్ములు ఇద్దరు బీసీ హాస్టల్ లో ఉంటూ చదువుకున్నారు.
ఎన్నడూ కూడా ఆడంబరా లకు పోకుండా తల్లిదండ్రుల మీద గౌరవంతో ఉన్నతంగా చదివి ఉన్నత ఉద్యోగాలు సంపాదించి సమాజంలో గౌరవాన్ని సంపాదించుకున్నారు. మా ఎదుగుదలలో ప్రతి మెట్టు మా తల్లిదండ్రుల కష్టం ఉందని ఈ సందర్భంగా వారు ఆనందంతో తెలిపారు .
తమ పిల్లలు ఉన్న తంగా ఎదిగినప్పుడే తల్లిదండ్రుల హృదయం ఆనం దంతో నిండుతుందని కుమ్మరి యాదయ్య- యాద మ్మ దంపతులు పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
బుధవారం 19 మార్చి 2025

# మంత్రి పదవి రేసులో నేను ఉన్నా

## : ఎమ్మెల్యే బాలు నాయక్



చింతపల్లి –మార్చి 18(సూర్య టుడే ):మంత్రి పదవిపై దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ నోరు విప్పారు. తాను కూడా మంత్రి పదవికి పోటీలో ఉన్నానని బాలు నాయక్ పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీలో బాలు నాయక్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ఇప్పటి వరకు తమ సామాజిక వర్గానికి చోటు లభించలేదని తెలిపారు. కాంగ్రెస్ ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా కేబినెట్‌లో మా వాళ్లు లేరు అనే అసంతృప్తితో తమ సామాజికవర్గం వారు ఉన్నారన్నారు. కేసీఆర్ హయంలో మా సామాజిక వర్గానికి కేబినెట్‌లో స్థానం లభించిందని అన్నారు. తమ సామాజిక వర్గానికి కేసీఆర్ ఎక్కడా అన్యాయం చేయలేదు.. అయినా కాంగ్రెస్ పార్టీకి లంబాడీలు ఓట్లు వేశారు అని బాలు నాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఇప్పటి వరకు లంబాడీలకు మంత్రి పదవి దక్కలేదన్నారు. అధిష్టానం, సీఎం రేవంత్ మంత్రి పదవి విషయంలో సానుకూలంగా ఉన్నారని,మా సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. నేను కూడా పోటీలో ఉన్నా. నాకు డిప్యూటీ స్పీకర్, మావాళ్లకు ఇంకో ఏదో పదవి ఇస్తే కాదు.. కేబినెట్‌లో బెర్త్ కావాలని డిమాండ్ ఉంది. మైదాన ప్రాంతాలకు చెందిన ఏ గిరిజన నాయకుడికి కూడా మంత్రి పదవి దక్కలేదు అని బాలు నాయక్ తెలిపారు.

# నూతన పంచాంగ ఆవిష్కరణ



చండూర్ మార్చి 18 (సూర్య టుడే):చండూరులోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మునుగోడు నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వా వసు నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మురుకుంట్ల రాజేశ్వర శర్మ, బేరం భాస్కర శర్మ, ఉప్పల బాలసుబ్రమణ్య శర్మ, ఉప్పల అనిల్ శర్మ, ఉప్పల అనంతగిరి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చిరువెల్లి ప్రవీణ్ శర్మ, వేమ వరపు వెంకటరమణ శర్మ, మాడా పాపయ్య శర్మ, ఉప్పల అభిలాష్ శర్మ, పగిడిమర్రి శ్రీధరన్ శర్మ, ఉప్పల కార్తీక్ శర్మ, చిరువెల్లి హరికిషన్ శర్మ, లోక వెంకటేశ్వర శర్మ, పెద్ది శ్రీధర్ శర్మ పాల్గొన్నారు.

## ఎండిన వరి పంటకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి:- కొమ్ము గణేష్



చండూరు మార్చి 18 (సూర్య టుడే): ఎండిన వరి పంట పొలాలకు నష్టపరి హారం ఒక ఎకరానికి 30 వేలు రూపాయలు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఎండిపోయిన వరి పంట సాగు రైతులని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ప్రైవేటు అప్పులు తెచ్చి,ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట పొలాలు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో వ్యవసాయ అధికారులు,రెవెన్యూ అధికారులు గ్రామాలను సందర్శించి పంటల వారీగా, రైతులకు నష్టపరిహారం అంచనా వేసి ఎకరానికి వరి పంట పొలాలకు 30 వేల రూపాయలు, నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని నష్టపోయిన రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని, తిరిగి విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# బిఆర్ఎస్ యూత్ నాయకులు అరెస్ట్



చండూర్ మార్చి 18 (సూర్య టుడే):ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు రాస్తారోకోల పై నిర్బంధాలు విధించిన వీసీ వైఖరికి నిరసనగా చలో అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర బీఆర్ఎస్వి విద్యార్థి విభాగం పిలుపు నివ్వగా ముందస్తుగా గట్టుప్పల్ మండల కేంద్రం లోని బీఆర్ఎస్వీ యూత్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఓయూ లో ధర్నాలు నిరసన లు నిషేధిస్తూ విసి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని బిఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో ఖమ్మం రాజశేఖర్, చిలువేరు అయోధ్య, చేరుపల్లి రమేష్, మదగాని సందీప్, పెదగని మనోజ్ ఉన్నారు.

# చలో జిల్లా కలెక్టరేట్ పాదయాత్రను జయప్రదం చేయండి

**-సిపిఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య పిలుపు**
**-ఫార్మా రైతులకు అండగా ఉంటాం పార్టీలకతీతంగా కలిసి రండి**
**-ముఖ్యఅతిథిగా.. తమ్మినేని వీరభద్రం రాక**
**-డి ఎస్ ఆర్ గార్డెన్ లో సిపిఎం మండల కమిటీ సమావేశం**



యాచారం సూర్య న్యూస్ ( మార్చి 17):. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఈనెల 27, 28 తేదీలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మేడిపల్లి నుండి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రేట్ వరకు పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య పిలుపుని చ్చారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో డి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఫార్మా రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 500 గజాలు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు చేసే వరకు రైతుల పక్షాన సిపిఎం అండగా ఉంటుందని ప్రకటన చేశారు. ఈనెల 27న పాదయాత్రకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నారని తెలిపారు. ఈ పాదయాత్రను సిపిఎం పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, ఫార్మాసిటీ వ్యతిరేకంగా పోరాటం నిర్వహిస్తున్న శ్రేయోభిలాషులు, రైతులు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, పి అంజయ్య, మండల కమిటీ సభ్యులు, బ్రహ్మయ్య, పి వెంకటయ్య, జంగయ్య, చందు నాయక్, పెద్దయ్య, జగన్, తావు నాయక్, పద్మ, విప్లవ కుమార్, బాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మారెడ్డి గూడెంలో రేషన్ డీలర్ ను నియమించాలి

**సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ- రేషన్ డీలర్ లేక ప్రజలు అవస్థలు**




చండూరు మార్చి 18 (సూర్య టుడే):
తిమ్మారెడ్డి గూడెంలో రేషన్ డీలర్ ను నియమించాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు. మంగళవారం చండూరు మండల పరిధిలోని తిమ్మారెడ్డి గూడెంలో ప్రజా సమస్యలపై ప్రజా పోరుబాట కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సింహుల గూడెం ప్రధాన బీటీ రోడ్డునుండి తిమ్మారెడ్డి గూడెం వరకు జరిగే రోడ్డు పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నత్త నడకగా సాగుతున్నాయని, ఈ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ గ్రామం నుండి రేషన్ బియ్యం కోసం ప్రజలురెండు కిలోమీటర్ల దూరం నుండి తుమ్మల పల్లి గ్రామానికి వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి విస్మరించిందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మహిళలకు రూ. 2500 ఇవ్వాలని, భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, స్థలం లేని వారికి ప్రభుత్వమే స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా భూమిలేని పేదలకు ఆత్మీయ భరోసా వర్తింపజే యాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24, 25, 26 తేదీలలో తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిట్టి మల్ల లింగయ్య, ఈరటి వెంకటయ్య, గ్రామ ప్రజలు ముత్యయ్య, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో రజక వృత్తిదారులకు రూ.1000 కోట్లు కేటాయించాలి

**రజకులకు ఇచ్చిన హామీలన్నిటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి**




చండూరు మార్చి 18 (సూర్య టుడే):మంగళవారం రోజు చౌటుప్పల్ మండలం పరిధిలోని జై కేసారం, యస్ లింగోటం, చిన్నకొండూర్ గ్రామాల్లో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి బాతరాజు దశరథ, వడ్డెబోయిన వెంకటేష్ లు మాట్లాడుతూ బడ్జెట్లో రజక వృత్తిదారులకు 1000 కోట్లు కేటాయించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం రజక సంక్షేమం కోసం రూ.25000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, దాంట్లో కేవలం 183 కోట్లు మాత్రమే ఇవ్వడం జరిగిందని అందులో అత్యధికంగా విద్యుత్ బకాయిలు మాత్రమే చెల్లించారని అన్నారు. సంక్షేమ రంగాలకు, మోడ్రన్ ధోబి గాట్లు ఏర్పాట్లకు, సంక్షేమ వ్యక్తిగత రుణాల కోసం వీటన్ని అవసరాల కోసం రూ 1000 కోట్లు అవసరాల కోసం బడ్జెట్లో 1000 కోట్ల రూపాయల కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా రజక ఫెడరేషన్కు పాలకవర్గాన్ని నియమించాలని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో రజకులకు ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని ఆ హామీలను అన్నిటినీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో నెంబర్ 102 ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రులు, కాలేజీలు, పోలీస్ బెటాలియన్లు, వివిధ దేవస్థానాల్లోని వృత్తిని కాంట్రాక్టర్లకు కాకుండా రజక సొసైటీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అత్యంత వెనుకబాటులో ఉన్న సేవావృత్తులైన ఇల్లు లేనటువంటి రజకులకు మొదటి ప్రాధాన్యతగా బీసీ ఏ కోటలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో నెంబర్ 2 ప్రకారం అమలవుతున్న ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించినటువంటి విద్యుత్ బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థకు చెల్లించి ఉచిత విద్యుత్ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం సకాలంలో ఉచిత విద్యుత్ బకాయిలను చెల్లించకపోవడంతో ఇస్త్రీ చేసుకున్న వృత్తిదారులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఒక్కోవృత్తిదారుడు ఏసిడి బిల్లు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభమైన తర్వాత కొద్ది రోజుల నుండి రూ.2000 నుండి రూ.4000 వరకు అంతకు ఎక్కువగా కూడా అదనంగా చెల్లిస్తున్నారని, ప్రభుత్వం విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు ఇచ్చే బిల్లుల్లో 30 నుండి 60 వేల వరకు బిల్లులు ప్రింట్ ఇవ్వడంతో వృత్తిదారులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది . ఇస్త్రి షాపులకు ఉచిత కరెంటు మీటర్ సప్లైను ఏదో విధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు ఇందిరమ్మ పథకంలో బీసీ ఏ కోటలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, 50 సంవత్సరాలు పైబడిన వృత్తిదారులందరికీ పెన్షన్ ఇవ్వాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని, రక్షణ చట్టం తేవాలని వృత్తి చేసుకుంటూ చనిపోయిన వృత్తిదారులందరికీ 10 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకులకు ఇచ్చినటువంటి హామీలన్నింటిని అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వడానిస్వాగతిస్తున్నామని, దానికి చట్టబద్ధత కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాని రజక వృత్తిదారుల సంఘం స్వాగతిస్తుందన్నారు.
ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బాతరాజు యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అవనిగంటి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు పెదగంటి లింగస్వామి, పెదకంటి రమేష్, కల్మాకుల సాలయ్య, పెదకంటి కుమారు, పెదకంటి మహేష్, పెదకంటి బీమారాజు, ఎలుకరాజు సుధాకర్, ఎలకరాజ యాదగిరి, బాతరాజు వెంకటేష్, పి. మస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# 15 నెలలో ఒక్క ప్రొసీడింగ్ అయిన తెచ్చారా?

- మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



కొత్తూరు, సూర్య టుడే (మార్చి 18)బీకొత్తూరు మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్ని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరుగుతున్నాయని బిఆర్ఎస్ ప్రభుత్వ%శీ%లో అభివృద్ధి కుంటుబడిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పడం ఆయన స్థాయికి ఏమాత్రం తగదని మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు.మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కొత్తూరు మున్సిపాలిటీని దత్తత తీసుకొని అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు కోసిగి శ్రీనివాస్ చింతకింది చంద్రకళ రాజేంద్ర గౌడ్,మాధవి గోపాల్ గౌడ్ లతో కలిసి పాపిరస్ పోర్ట్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హయాంలో సుమారు వంద కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.ఎన్నికల ముందు మంజూరైన పనులను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అందుకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను మీడియాకు చూపించారు.బిఆర్ఎస్ నాయకులు చూపెడుతున్న ప్రొసిడింగ్ కాపీలు చిత్తు కాగితాలని కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చాకనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులు మంజూరు చేయడంతోనే పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని అదే నిజమైతే అందుకు సంబంధి ంచిన ప్రొసీడింగ్ కాపీలతో కాంగ్రెస్ నాయకులు ముందుకు తీసుక రావాలని ఆమె సవాల్ విసిరారు. ప్రొసిడింగ్ కాపీలు లేకుండా పనులు తామే చేశామనడం కాంగ్రెస్ నాయకుల కు ఏమాత్రం తగదని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చేసిన పనుల్లో కేవలం 10 శాతం చేసిన సంతోషిస్తామని ఎద్దేవా చేశారు.15 నెలల్లో మీరు తెచ్చిన ఒక్క ప్రొసీడింగ్ కాపీనైన చూపెట్టాలని అన్నారు.పూలే చౌరస్తా నుండి వినాయక స్టీల్ పరిశ్రమ వరకు వేస్తున్న 100 ఫీట్ల రోడ్డును గత ప్రభుత్వం మంజూరు చేస్తే దానిని సగానికి సగం తగ్గించి పనులు చేస్తూ అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు.ఎవరి లబ్ధి కోసం 100 ఫీట్ల రోడ్డును తగ్గించారో ప్రజలకు తెలపాలని ఆమె డిమాండ్ చేశారు.ము న్సిపాలి టీలో ఎలాంటి ప్రోటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ అయిన తనకు మున్సిపాలిటీలో జరుగుతున్న పనులకు ఎలాంటి సమాచారం లేకుండా ఎమ్మెల్యే పర్యటిస్తూ పలు శంకుస్థాపన కార్యక్రమాలు. చేస్తున్నారని పేర్కొన్నా రు.ఈ సమావేశంలో కర్రోళ్ల లక్ష్మయ్య,శివ చారి,రవి నాయక్,సిటీ కేబుల్ వెంకటేష్, ఓం ప్రకాష్ చారి,బండి శ్రావణ్ యాదవ్,రాఘవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేను సీనియర్‌ని నాకు ఎలా మాట్లాడాలో తెలుసు

నాకు ఎవరి సలహాలు అవసరం లేదు



హైదరాబాద్: తాను సీనియర్ ఎమ్మెల్యేని, తనకి ఏం మాట్లాడాలో తెలుసు. ఏం మాట్లాడాలో తనకి ఎవరు చెప్పాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. అనేక సందర్భాల్లో క్యాంపు ఆఫీస్‌కు స్థలం కావాలని విజ్ఞప్తి చేశానని.. తన విజ్ఞప్తి పక్కన పెట్టి వేరే వేరే ఆఫీస్‌కు శంకుస్థాపన చేశారని అన్నారు. అందుకే శిలాఫలకం కూలగొట్టిన్నట్లు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కాలనీలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులు కానీ పోలీస్ అధికారులు కానీ పట్టించుకోవటం లేదని అన్నారు. సోషల్ మీడియాకు భయపడి వెంటనే రెస్పాండ్ అయ్యే అధికారులు ఎమ్మెల్యే ఫిర్యాదుకు స్పందించటం లేదని సభలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. 'నాకు సంబంధించి.. నా క్యాంప్ ఆఫీసు గురించి గత పదిహేను నెలల నుంచి విజ్ఞప్తి చేస్తున్నాను. మేము అడిగిన క్యాంప్ ఆఫీసు గురించి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వద్ద సమాచారం లేదని తెలిపారు. ఇది ఆశ్చర్యకరమే. మా నియోజకవర్గం రోడ్ నెంబర్ 10లో ఈద్గా గ్రౌండ్ ఉందని.. ఆ గ్రౌండ్ ఒక సబ్‌స్టేషన్ గురించి ల్యాండ్ అలాట్‌మెంట్ ఇచ్చారని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు రంజాన్ నడుస్తోంది. ఈద్గా గ్రౌండ్‌లో నాకు క్యాంప్ ఆఫీసుకు స్థలం ఇవ్వమంటే ఐడెంటిఫై చేయలేకపోయారు. సబ్ స్టేషన్‌కు నా ప్రమేయం లేకుండానే శంకుస్థాపన చేశారన్నారు. నా రెగ్యులర్ స్టైల్‌లో శిలాఫలకాన్ని పలగొట్టాను' అని అన్నారు. 'నేను మంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాన చేసి ఈడబ్ల్యూఎస్ కాలనీ కట్టించానని, కానీ ఆ కాలనీలో ఓ వ్యక్తి.. కొందరికి డబ్బులు ఇచ్చి అక్కడి ఇళ్లను లాక్కున్నాడన్నారు. దాదాపు ఆరు ఫ్లోర్లతో ఇళ్లు కట్టాడని.. ఈ విషయంపై జోనల్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాను. ఎమ్మార్వో, తహశీల్దార్, డీసీకి విషయాన్ని తెలియజేశాను. అయినప్పటికీ యాక్షన్ తీసుకోలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాను.. ఇది నా బాధ్యత' అని ఎమ్మెల్యే దానం నాగేందర్ వెల్లడిరచారు.

# భూములు ఇచ్చేది లేదు

-మొండి గౌరెల్లి రైతులతో సమావేశం


-యాచారం తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత

-ఇబ్రహీంపట్నం ఆర్టీవో అనంతరెడ్డికి వినతి పత్రం అందజేత



యాచారం సూర్య న్యూస్ (మార్చి 17):. పారిశ్రామిక పార్కు కు భూములు ఇచ్చేదే లేదని బిజెపి నాయకులు మర్రిపల్లి అంజయ్య యాదవ్, తాండ్ర రవీందర్, మాజీ సర్పంచ్ బండి మీది కృష్ణ, అన్నారు. మంగళవారం మండల పరిధిలో మొండి గౌరెల్లి గ్రామ ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా. సర్వే నెంబర్లు 19, 28 ,127 లలో కాంగ్రెస్ ప్రభుత్వం పార్కుల పేరుతో దళితుల భూములు భూ సేకరణ చేయడం చాలా దుర్మార్గమని అన్నారు. ఇవే కాకుండా పట్టా పొలాలు కూడా భూసేకరణ చేయడం మొండి గౌరెల్లి గ్రామంలో ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో లగ చర్ల లాగా పెద్ద ఉద్యమాన్ని తీసుకొని ఉధృతం చేయాలని ఆ గ్రామ ప్రజలు రైతులు నిర్ణయించుకున్నారు. అలాగే యాచారం తాసిల్దారు అయ్యప్పకు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతి పత్రాలు అందించారు. మా ప్రాణాలు పోయిన మా భూములు ఇవ్వమని రెవిన్యూ అధికారులకు తెలిపారు. భూ సేకరణ పేరుతో ఏ అధికారి వచ్చిన వారిని నిలదీసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. ఇప్పటికైనా మా బాధలను, మా ఆందోళన అర్థం చేసుకోవాలని పార్టీలకతీతంగా నేతలు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి నక్క శ్రీనివాస్ యాదవ్, రామ్ రెడ్డి, మేకల యాదగిరి రెడ్డి, కట్టెల కృష్ణ, కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ యాదయ్య, బడే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట్ జడ్పిహెచ్ఎస్ లో విద్యార్థులు కల్చరల్ ప్రోగ్రామ్




షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మార్చి 18) కేశంపేట్ మండల పరిధిలోని కొత్తపేట పీఎం శ్రీ జెడ్పిహెచ్ ఎస్ హైస్కూల్ లో మంగళ వారం జరిగిన అన్యువల్ డే కల్చరల్ ఈవెంట్లో విశిష్ట అతిథిగా పాల్గొన్నారు మరియు కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, విద్యార్థులు రంగురంగుల దుస్తులతో ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రధానోపాధ్యాయులు శేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట్ ఆదర్శ అన్నత పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం:-
కేశంపేట మండల కేంద్రంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ...పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని, పాఠశాలకు పేరు తేవాలని సూచించారు.అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, భాగ్యరాజు ,కృష్ణ ,శ్రీశైలం, శ్రీధర్, నర్మదా, అన్నపూర్ణ, స్వాతి ,స్పందన ,శాలిని, సాయిరూప ,మానెమ్మ, మౌనిక, నస్రీన్ లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన చదువు ఉన్నతమైన మార్గానికి బాట

చదువు ద్వారానే మీ భవిష్యత్తు మారుతుంది


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ జి ఇందిర



నాంపల్లి మార్చి 18 (సూర్య టుడే)
టెన్త్ క్లాస్ విద్యార్థిని ,విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమంలొ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ జి ఇందిర పాల్గొన్నారు. అనంతరం ఆమె విద్యార్థిని.విద్యార్థులను ఉద్దేశించి. మాట్లాడారు క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్తులో బంగారు బాటగా ఉంటుంది. విద్యార్థులు ఎప్పుడూ చదువు విస్మరించవద్దు చదువు మీ తలరాతను మారుస్తుంది. టెన్త్ క్లాస్ విద్యార్థిని విద్యార్థులు నాంపల్లి మండ లానికి, మంచి పేరు తీసుకురావాలని విద్యార్థిని విద్యార్థులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అజయ్ కుమార్. ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థిని ,విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్నదాన వితరణ కార్యక్రమం





చండూర్ మార్చి 18 (సూర్య టుడే):చండూర్ మండలం తుమ్మలపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన వారు చండూరు సన్ షైన్ అధినేత కోడి సుష్మ వెంకన్న, లక్నేనిగూడెం వాస్తవ్యులు ఏనుగు వెంకటరెడ్డి, చండూరు వాస్తవ్యులు కొండమీది లవ కుమార్. ఈ కార్యక్రమంలో చైర్మన్ గన్ రెడ్డి రమ్య రామలింగారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగిరెడ్డి, దేవాలయం కమిటీ ఇన్స్పెక్టర్ సుమతి, అర్చకులు కారువంగా నర్సింహ శర్మ, తిరుపతయ్య శర్మ, శంకర్ శర్మ, గిరి ప్రసాద్ శర్మ, హరి ప్రసాద్ శర్మ, దేవాలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, మహిళలు, యువకులు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# నిజాలు బయట పెడితే అక్రమ అరెస్టులా?

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ

రేవతి, తన్వి యాదవ్ విడుదల.



కొత్తూరు, సూర్య టుడే (మార్చి 18)బీ నిజాలు బయట పెడితే అక్రమ అరెస్టులా! బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ. తెలంగాణ ఆడబిడ్డలు జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవులు చంచల్ గూడా జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, బాతుక దేవేందర్ యాదవ్, జైలు వద్ద వారికి స్వాగతం పలికారు. సత్యనారాయణ మాట్లాడుతూ... నిజాలు బయట పెడితే అక్రమ అరెస్టులా బిఆర్ఎస్ పార్టీ జర్నలిస్టులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అధైర్య పడద్దని ధైర్యంగా ఉండాలని సూచించారు. జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్, విడుదలకు కృషిచేసిన న్యాయవాది లలితారెడ్డిని అభినందించారు.

# బీఆర్ఎస్వీ చండూర్ మండల అధ్యక్షులు లింగస్వామి గౌడ్ పనస ముందస్తు అరెస్ట్




చండూర్ మార్చి 18 (సూర్య టుడే): బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సామాజిక ప్రజా ఉద్యమాలకు వేదిక అయిన ఓయూలో విద్యార్థులు నిరసన కార్యక్రమాలు రద్దు చేయడం అన్యాయం. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి దొడ్డి దారిన రావచ్చు. కానీ ఓయూ విద్యార్థులు విద్య, నిరుద్యోగ సమస్యల మీద ప్రశ్నిస్తే తప్పా? విద్యాశాఖను తన దగ్గర పెట్టుకొని యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి ని రద్దు చేయాలనీ కుట్రలు మానాలని డిమాండ్ చరిస్తున్నాం. 100 సంవత్సరాల యూనివర్సిటీ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా నిర్బంధాలను కొనసాగించలేదు. సమాఖ్య రాష్ట్రము లో కూడా రేవంత్ రెడ్డిల ఎవరు నిర్బంధాలను విధించలేదు. ముల్కి ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమాలు, సామజిక ఉద్యమాలకు ప్రజల తరుపున మాట్లాడే గొంతుకలు ఓయూ విద్యార్థులు అలంటి విద్యార్థులను స్వేచ్ఛ హరించే సర్క్యులర్ను రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తున్నాం. కాంగ్రెస్ కార్యకర్తల ప్రోగ్రాంలకు అనుమతులు అవసరం లేదు. కానీ సమస్యలమీద మాట్లాడితే కేసులా ? అరెస్టు అయిన విద్యార్థి నాయకులు విరమల్ల స్వామి బోయపల్లి సతీష్ అన్నారు.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక

బుధవారం 19 మార్చి 2025

# తీదేడులో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి సన్నిధిలో ఘనంగా రథోత్సవం

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత.

## మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి.....

చింతపల్లి, చింతపల్లి సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 18 దైవచింతనతో మానసిక ప్రశాంతత అని తేదేడు మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాయితి జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని తీదేడు గ్రామంలో ఘనంగా వేలాదిమంది భక్తుల నడుమ శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రథోత్సవాన్ని యువకులు ఎంతో ఉత్సాహంగా లాగారు. అనంతరం స్వామివారిని ఊరేగింపు కార్యక్రమంలో భజనలు, కోలాటాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయంలో ఉంచారు. గ్రామ ప్రజలందరూ కలిసి హెూలీ నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు హాజరై స్వామివారి ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గుట్టపై భక్తుల దర్శనం కోసం ఆలయ కమిటీ నిర్వాహకు సకల సౌకర్యాలు సమకూర్చారు. అనంతరం గ్రామంలో హెూలీ వేడుకలు గ్రామ ప్రజలు అందరూ పాల్గొని వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొంది. స్వామివారి ఉత్సవాలను గత 200 సంవత్సరాల నుండి ప్రతి ఎటా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా గత వారాల రోజుల నుండి జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని భక్తులకు అందజేస్తున్నారు. గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చింతపల్లి ఎస్సై బి యాదయ్య ఆధ్వర్యంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలు సవ్యంగా జరిగేందుకు ఎంతో కృషి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, యాదగిరి, రమణా రెడ్డి,గ్రామ ప్రజలు, చింతపల్లి మండల గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి లు వివిధ పార్టీల ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు వేద పండితులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మంత్రాలు బాబోయ్ మంత్రాలు భయాందోళనలో ప్రజలు

చింతపల్లి,సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 18 ప్రపంచం ముందుకు సాగుతున్నా కొంత మంది క్షుద్రపూజలు చేసి కలకలం రేపుతున్నారు. సైన్స్ శరవేగంగా అభివృద్ధి చెందుతూ అంతరిక్షంలో దూసుకుపోతున్నా.. కొన్ని మూఢనమ్మకాలు మాత్రం ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. క్షుద్ర పూజల పేరుతో సామాన్య ప్రజలను కొంతమంది మంత్రగాళ్లు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం చింతపల్లి మండల కేంద్రంలో నెలరోజుల నుండి ఇన్స్పెక్షన్ బంగ్లా పరిధిలో వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా సోమవారం రాత్రి కొప్పురి వెంకటయ్య ఇంట్లో వంట గదిలో ముగ్గుతో రతివేసి రవికె అమర్చి చుట్టూ కుంకుమ పసుపుతో అన్నంముద్దలు పెట్టి నిమ్మకాయలు ఆపాదించి పైన వస్త్రం కప్పి గ్రామంలో శుక్ర వారం క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. గత నెల రోజులుగాపసుపు, కుంకుమ, జీడీ గింజలు, ఎర్రటి వస్త్రాలు, పిండి బొమ్మ, మంత్ర తంత్రాలతో చేసిన ఆనవాళ్ళు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. సాయంత్రం ఏడు గంటల తరువాత బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. గత నెల రోజులుగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినా ఇప్పటివరకు మంత్రాలు చేసి భయాందోళనకు గురిచేస్తున్న వ్యక్తులు మాత్రం ఎవరో తెలియ దంలేదని గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాదయ్య తన సిబ్బందితో ఎన్నోసార్లు వాకబు చేసినా మంత్రగాళ్లు మాత్రం దొరకడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# 50 ఏళ్లకే పెన్షన్ ప్రతిపాదన ఆలోచిస్తాం

## కేవలం మరణించిన వారి పెన్షన్లు మాత్రమే తొలగించాం

## మండలిలో పెన్షన్లపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం

అమరావతి,మార్చి18(ఆర్ఎన్ఎ): 50 ఏళ్లకు పెన్షన్లు ఇచ్చేందుకు పరిశీలన చేస్తున్నాం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు యాభై ఏళ్లకే పెన్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచటానికి ఐదేళ్ల సమయం తీసుకుంది. మేము రాగానే వెంటనే ఒక వెయ్యి పెంచాం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండలిలో పలువురు సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తొలిసారి పెన్షన్లు మొదలుపెట్టారు. 2014లో పెన్షన్ వెయ్యి నుంచి రెండు వేలకు టీడీపీ ప్రభుత్వం పెంచింది. వృద్ధాప్య పెన్షన్లతో పాటు మత్స్యకార, ట్రాన్స్ జెండర్ పెన్షన్లు కూడా ఇస్తున్నాం. కేవలం మరణించిన వారి పెన్షన్లు మాత్రమే తొలగించాం అని వివరించారు. ఏపీ శాసనమండలిలో పెన్షన్లపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు సంధించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యే సమయానికి 53 లక్షల మందికి పెన్షన్‌లు ఉన్నాయని, కూటమి అధికారంలోకి వచ్చే సమయానికి 65 లక్షలకు పెన్షన్లు పెరిగాయని వైసీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెన్షన్లు ఎన్ని తొలగించారని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చాక 1.89 లక్షల మందికి తగ్గించారని, బడ్జెట్‌లో ఉన్న పెన్షన్లకి సరిపడా కేటాయింపులు చేయలేదని వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ ఫైర్ అయ్యారు. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా పెన్షన్లు మంజూరు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక 1.89 లక్షల మందికి తగ్గించారు. బడ్జెట్‌లో ఉన్న పెన్షన్లకి సరిపడా కేటాయింపులు చేయలేదు. మీరు 50 ఏళ్లకే ఇస్తామన్న పెన్షన్లు ఇస్తారా? లేదా?. పెన్షన్ల పరిశీలన అంటూ తగ్గిస్తూ వెళ్తున్నారు. కూటమి నేతలు హామీ ఇచ్చిన విధంగా అర్హులకు పెన్షన్లు ఇవ్వాలని వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ డిమాండ్ చేశారు. 'జగన్ ముఖ్యమంత్రి అయ్యే సమయానికి 53 లక్షల మందికి పెన్షన్లు ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చే సమయానికి 65 లక్షలకు పెన్షన్లు పెరిగాయి. ఇప్పుడు పెన్షన్లు తొలగిస్తే ఎన్ని తొలగించారు?' అని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ప్రశ్నించారు. 'యాభై ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఏ ప్రతిపాదన చేయలేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేరొన్నారు.

# చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

## టరయల్ కోర్టుల తీరుపై సుప్రీం అసహనం

## ప్రజాస్వామ్యంలో పోలీస్ రాజ్యం కారాదని వ్యాఖ్య

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసుల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పు బట్టింది. ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు.

రెండు దశాబ్దాల క్రితం.. చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయిల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అనవసరంగా వ్యవస్థపై భారం పడుతోందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక చిన్న కేసులో రెండేళ్లకు పైగా కస్టడీలో ఉన్న నిందితుడికి బెంచ్ బెయిల్ మంజూరుచేసింది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీంకోర్టు ముందుకుతీసుకురావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. చిన్నచిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోను బెయిల్ మంజూరుచేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

# ఉపాధిహామీని నీరుగార్చే యత్నం

## రాజయసభలో సోనియా ఆవేదన

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపరచడం బాధాకరం అని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ సోనియా గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై రాజ్యసభలో సోనియా మాట్లాడారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమపద్ధతిలో బలహీనపరచడం చాలా ఆందోళనకరం అని తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 86,000 కోట్లు స్తబ్దుగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పథకం బహుళ సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. వేతన చెల్లింపుల్లో నిరంతరం జాప్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అలాగే ప్రస్తుతం చెల్లిస్తున్న నగదు కూడా సరిపోదని.. దాన్ని రూ.400 కనీస వేతనంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సకాలంలో వేతనం ఇవ్వకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని సభ దృష్టికి సోనియా తీసుకొచ్చారు. ఇక పథకాన్ని మరింత విస్తరించడానికి తగినంతగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని సోనియా కోరారు.

# 14 విడత సామాజిక తనిఖీ (ప్రజా వేదిక)కార్యక్రమం




చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 18

14వ విడత సామాజిక తనిఖీ (ప్రజా వేదిక) చింతపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పనుల్లో జరిగిన వివిధ పనులపై గత ఐదురోజులుగా మండలంలోని 12 గ్రామాల్లో సేకరించిన వివరాలతో శనివారం ప్రజావేదిక (సామాజిక తనిఖీ)ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉపాధికూలీల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల సమక్షంలో ఉపాధి హామీ పనులలో జరిగినటువంటి పనులను తదితరు వివరాలను చర్చించడం జరిగింది.

ప్రజా వేదికలో ప్రిసైడింగ్ ఆఫీసర్ అడిషనల్ పీడీ నవీన్ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్ , దేవరకొండ క్లస్టర్ ఈపిడి డాక్టర్ యామిని, %నఆ% పసివుద్దిన్, ఎంపీడీవో సుజాత, ఏపీవో శౌరి రెడ్డి, ఈసీ సుమీర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నాంపల్లి బీ అర్ ఎస్ నాయకుల అరెస్టు




నాంపల్లి మర్చి 18 న్యూస్( సూర్యా టుడే)మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి గారిని అసెంబ్లీ లో సస్పెండ్ చేయడంతో నాంపల్లి మండల బిఆర్ ఎస్ నాయకులు మండల కేంద్రంలో నిరసనలు చేపడతారని ముందస్తు సమాచారం తో స్థానిక పోలీసులు బి ఆర్ ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా సింగల్ విండో డైరెక్టర్ బెల్లి సత్తయ్య మాట్లాడుతు ప్రశ్నించే గొంతులను ప్రభుత్వం అరెస్టులు చేసి భయపెట్టాలని చూస్తూంది అన్నారు. శాంతి యుతంగా నిరసనలు చేట్టలని చూస్తున్న మమ్ములను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. ఆయన వెంట నెరల్ల సైదులు, నాంపల్లి బిక్షం, గంజీ సంజీవ, కస్తూరి రాము తదితరులు ఉన్నారు

# పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేసిన జిహెచ్ఎం శ్రీనివాసరావు



నాంపల్లి మార్చి 18 న్యూస్ ( సూర్యా టుడే) నాంపల్లి మండలంలోని ముష్టిపల్లి హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు మంగళవారం జిహెచ్ఎం శ్రీనివాసరావు విద్యార్థులకు అందజేసి అభినందనలు తెలిపారు. 100% ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, దామోదరాచారి, సుధాకర్ రెడ్డి, రాజేశ్వరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు

# ఇన్వెస్టర్లకు శుభవార్త.. త్వరలో అమెజాన్ ఐపీఓ కూడా..

మదుపర్లకు గుడ్ న్యూస్. త్వరలో ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా వారి యూనిట్ ద్వారా ఐపీఓకు రాబోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎప్పటి నుంచి వస్తుందనే తదితర విషయాలను ఇక్కడ చూద్దాం.ఇన్వెస్టర్లకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఎందుకంటే అమెరికాకు చెందిన ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్కూడా ఇండియాలో తన భారతీయ విభాగాన్ని సపరేట్ చేసి స్టాక్ మార్కెట్లో ఐపీఓకురావాలని చూస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే కంపెనీ వర్గాలు చర్చలు ప్రారంభించినట్లు తెలిసింది.ఈ క్రమంలో అమెజాన్ తన వాల్ స్ట్రీట్ బ్యాంకింగ్ భాగస్వామి జేపీ మోర్గాన్తోపాటు భారతదేశంలోని పెట్టుబడి బ్యాంకులతో చర్చలు ప్రారంభించిందని ఓ నివేదిక తెలిపింది.

ఈ నేపథ్యంలో గత వారం అమెజాన్ ఇండియా దీని కోసం 8 నుంచి 10 పెట్టుబడి బ్యాంకులను ఆహ్వానించింది. భారత నిబంధనల ప్రకారం, దేశీయ కంపెనీలు మాత్రమే ఇన్వెంటరీ ఆధారిత ఇ-కామర్స్ మోడల్ కింద పనిచేస్తాయి. తద్వారా వేగవంతమైన డెలివరీలు, షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.

అయితే, విదేశీ సంస్థలు కొనుగోలుదారులు, విక్రేతల మధ్య మధ్యవర్తిగా పనిచేసే మార్కెట్ ప్లేస్ మోడల్ విధానాన్ని




అనుసరించాలి. ఈ నియంత్రణ అంతరం చాలా కాలంగా అమెజాన్కు సవాలుగా మారింది. మరోవైపు ఫ్లిప్కార్ట్, రిలయన్స్ జియోమార్ట్ వంటి స్వదేశీ కంపెనీలతో సమర్థవంతంగా పోటీ పడే సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది.

# ఐపీఎల్ మ్యాచ్ వీక్షకులకు బంపర్ బొనాంజా

## వీక్షకులకు ఉచిత మెట్రో రైలు రవాణా- చెన్నై మెట్రో శాఖ కీలక నిర్ణయం

క్రికెట్ ప్రపంచంలో ఉర్రూతలూగించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభానికి సిద్ధమైంది. కొన్ని గంటల్లో ఈ మహా క్రీడా సంగ్రామం ప్రారంభం కానుండగా.. మ్యాచ్ వీక్షించే అభిమానులకు బంపర్ బొనాంజా తగిలింది. క్రికెట్ ప్రియులు అతికష్టంగా సంపాదించిన ఐపీఎల్ మ్యాచ్కు సంబంధించి చెన్నై మెట్రో శాఖ బంపర్ ఆఫర్ ప్రకటించింది. మ్యాచ్ చూసే ప్రజలందరికీ ఉచిత మెట్రో రైలు రవాణా కల్పిస్తున్నట్లు శుభవార్త వెల్లడించింది. క్రికెట్ మ్యాచ్లు చూసే ప్రతి ప్రేక్షకుడికి ఉచితంగా మెట్రో రైలు రవాణా కల్పిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.తమిళనాడు తరఫున ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. విజిల్ పోడు అంటూ ఎల్లో ఆర్మీ ఐపీఎల్లో రచ్చ చేస్తోంది. ఎల్లో ఆర్మీకి తమిళనాడు వ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. మరి అలాంటి చెన్నై సూపర్ కింగ్స్ తమపై ఆదరభిమానులు




చూపిస్తున్న ప్రేక్షకులకు అదిరిపోయే కానుక అందించింది. మ్యాచ్లకు వచ్చే ప్రతి ప్రేక్షకుడికి ఉచిత మెట్రో రైలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఐపీఎల్ సీజన్లో ప్రయాణికు లందరికీ చెన్నైలో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తూ మెట్రో సంస్థ ప్రకటించింది.

క్రికెట్ మ్యాచ్లు చూసే ప్రతి వీక్షకుడికి చెన్నై సూపర్ కింగ్స్తో చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఐపీఎల్లో జరిగే ప్రతి మ్యాచ్ కు వెళ్లే ప్రేక్షకుడికి ఉచిత ప్రయాణం అందించనున్నట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. మెట్రో స్టేషన్ నుంచి గవర్నర్మెంట్



ఎస్టేట్ వరకూ రాను పోను మెట్రో రైలు సేవలు క్రికెట్ వీక్షకులు ఉచితంగా వినియోగించుకోవచ్చు.ఉచిత ప్రయాణ సదు పాయానికి సంబంధించిన కొన్ని నిబంధనలు విడుదల చేసింది.

మ్యాచ్లు ఉన్న రోజులు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తు న్నారు. మెట్రో రైలు సేవలు వినియోగిం చుకోవచ్చని అధికారులు తెలిపారు. మ్యాచ్ జరిగిన రోజు అర్ధరాత్రి ఒంటి గంట వరకూ మెట్రో సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ప్రయాణికుల డిమాండ్ను బట్టి మెట్రో రైలు సేవల వేళలను చెన్నై మెట్రో సంస్థ ప్రకటిం చనుంది.

# మీ క్రెడిట్ కార్డ్ బిల్ చెల్లించినా..

## సిబిల్ స్కోర్ తగ్గుతుందా, ఇలా చేయండి

క్రెడిట్ కార్డులు అనేక మందికి కష్ట కాలంలో ఉపయోగపడతాయి. కానీ ఇవే క్రెడిట్ కార్డులు మరికొంత మందిని కష్టాల్లో పడేస్తాయి. అయితే పలువురు క్రెడిట్ కార్డ్ బిల్లులు చెల్లించిన తర్వాత కూడా వారి సిబిల్ స్కోర్ తగ్గుతుంది. అయితే అందుకు ఏం చేయాలనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.ప్రస్తుతం అనేక మంది ఉద్యోగులు కూడా క్రెడిట్ కార్డ్ వినియోగిస్తుంటారు. ఏది కొనుగోలు చేయాలన్నా, షాపింగ్ చేయాలన్నా కూడా క్రెడిట్ కార్డ్ తెగ వాడేస్తుంటారు. కానీ నెల చివరకు వచ్చే బిల్లులను చూసి షాక్ అవుతుంటారు. ఆ క్రమంలో ఆయా బిల్లులను సమయానికి చెల్లించుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ ఆలస్యం చేస్తే మాత్రం ఆ మొత్తంపై వడ్డీల మీద వడ్డీ పడుతుంది. ఆ క్రమంలో మీరు చెల్లించడం విషయంలో మరికొన్ని నెలలు ఆలస్యం చేస్తే ఆ మొత్తం ఇంకా పెరిగే ఛాన్స్ ఉంటుంది.

కొంత మాత్రమే

ఇలాంటి సందర్భాలలో అనేక మంది కూడా పెరిగిన బిల్లులు చెల్లించలేక సెటిల్ మెంట్




కోసం ఆసక్తి చూపిస్తారు. అయితే సెటిల్ మెంట్ చేసుకునే విషయంలో మాత్రం ఓ సారి ఆలోచించాలని నిపుణులు చెబుతుంటారు. రుణ గ్రహీత ఏకమొత్త రుణ పరిష్కారానికి అంగీకరించకూడదు. ఎందుకంటే ఆ మొత్తంలో కొంత భాగాన్ని మాత్రమే మాఫీ చేసి, మిగతా మొత్తాన్ని కట్టాలని చెబుతారు. మీరు దానికి ఒప్పుకుని పాటిస్తే, ఇది మీ క్రెడిట్ స్కోర్పై ప్రతికూల ప్రభావం పడుతుంది.

లోన్ తీసుకోవాలన్నా

ఈ నిర్ణయం మీకు అప్పుల నుంచి విముక్తి కలిగించవచ్చు. కానీ మీ క్రెడిట్ నివేదికలో మాత్రం 'సెటిల్డ్' అనే గుర్తు ఎల్లప్పుడూ కనిపిస్తుంది. ఇది మీకు దీర్ఘకాలంలో క్రెడిట్ స్కోర్పై ప్రభావం కనిపిస్తుంది.

# రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడు

### ఆర్సీబీ భవిష్యత్తు అతనే..

### పటీదార్పై కోహ్లీ ప్రశంసల జల్లు




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) నయా సారథి రజత్ పటీదార్పై ఆ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడని కొనియాడాడు. ఆర్సీబీ భవిష్యత్తు అతనేనని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ముంగిట ఆర్సీబీ.. తమ నూతన సారథిగా యువ ప్లేయర్ అయిన రజత్ పటీదార్ను నియమించిన విషయం తెలిసిందే.అప్కమింగ్ సీజన్ నేపథ్యంలో ఆర్సీబీ సోమవారం.. చిన్నస్వామి స్టేడియంలో అన్బాక్స్ ఈవెంట్ నిర్వహించింది. అప్కమింగ్ సీజన్తో పాటు టీమ్ కాంబినేషన్ గురించి కోహ్లీ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఈ క్రమంలోనే రజత్ పటీదార్ను కొనియాడుతూ.. అతనికి మద్దతుగా నిలవాలని ఫ్యాన్స్ను కోరాడు. 'రజత్ పాటిదార్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. ఆర్సీబీని విజయవంతంగా నడిపించడమే కాకుండా అభిమానుల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ఉంది. ఈ ఫ్రాంచైజీ అతనిపై పెట్టుకున్న ఆశల్ని అతను తప్పక నెరవేరుస్తాడనే నమ్మకం ఉంది. తప్పకుండా ఆర్సీబీని గెలుపు బాటలో నడిపిస్తాడు. సారథిగా ఎదగడానికి కావాల్సిన అన్ని అర్హతలు, ప్రతిభ అతనిలో ఉన్నాయి.'అని విరాట్ కోహ్లీ తెలిపాడు.ఐపీఎల్ 2021లో ఆర్సీబీ తరఫున అరంగేట్రం చేసిన రజత్ పటీదార్.. 4 మ్యాచ్లు ఆడి 71 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ పేలవ ప్రదర్శనతో ఆర్సీబీ తర్వాతి సీజన్కే అతన్ని వేలంలోకి వదిలేసింది. ఐపీఎల్ 2022 వేలంలో అతన్ని ఏ జట్టు కూడా కొనుగోలు చేయలేదు. దాంతో అన్సోల్డ్గా నిలిచాడు.

# ధోనీ చాలా ఫిట్గా కనిపిస్తున్నాడు


**బౌలర్లందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నాడు**

**ధోని కంటే గొప్పోడిని నేను చూడలేదు**

**ధోనీపై హర్భజన్ ప్రశంసల వర్షం**



టీమ్ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్?కు గుడ్?బై చెప్పినా ఐపీఎల్లో మాత్రం కొనసాగుతున్నాడు. 43 ఏళ్ల వయసులోనూ అద్భుతమైన ఫిట్?నెస్?తో ఐపీఎల్?లో ఫ్యాన్స్?ను అలరిస్తున్నాడు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2025 సీజన్ కోసం మహీ ఫిబ్రవరిలోనే చెన్నైకి చేరుకొని రెగ్యులర్?గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. అయితే ఇటీవలే టీమ్?ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, ధోనీ ఓ వివాహ వేడుకలో కలుసుకున్నారు. ఈ క్రమంలో ధోనీతో జరిగిన సంభాషణ గురించి భజ్జీ తెలిపాడు. తాను ఇటీవలే ధోనీని ఓ ఫ్రెండ్ కుమార్తె వివాహ వేడుకలో కలిశానని హర్భజన్ సింగ్ వెల్లడించాడు. అప్పుడు ధోనీ చాలా ఫిట్గా, దృఢంగా కనిపించాడని చెప్పాడు. "ఈ వయసులో ఏం చేస్తున్నావు (ఫిట్నెస్ను ఉద్దేశించి), కష్టమే కదా' అని అన్నాను. 'అవును ఈ ఫిట్నెస్ను కాపాడుకోవడం కష్టమే. కానీ, నేను చేయాలను కుంటున్నది ఇదే. నేను దానిలో ఆనందాన్ని పొందుతాను. ఫిట్గా ఉంటూ ఆటను కొనసాగించా లనుకుంటున్నా" అని ధోనీ బదులిచ్చినట్లు హర్భజన్ సింగ్? చెప్పాడు.ఏడాది పొడవునా ఎలాంటి క్రికెట్ ఆడకుండా ఫిట్నెస్ను కాపాడుకోవడం అనేది చాలా కష్టమేనని భజ్జీ వ్యాఖ్యానించాడు. కానీ, అది ఎలా సాధ్యమో ధోనీ చేసి చూపిస్తున్నాడని కొనియాడాడు. ధోనీ ఇతరుల కంటే మెరుగ్గా ఏదో చేస్తున్నాడని, నామమాత్రంగా జట్టులో కొనసాగడం లేదన్నాడు. తన బ్యాటింగ్తో ధోనీ బౌలర్లందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నాడని పేర్కొన్నాడు.




# రోహిత్ శర్మకు నీతా అంబానీ లగ్జరీ కారు గిఫ్ట్!



నీతా అంబానీ.. దాతృత్వ, సామాజిక సేవా కార్యక్రమాలతో నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. అలానే ఓవైపు రిలయన్స్ ఫౌండేషన్ బాధ్యతలు చూసుకుంటూనే.. మరోవైపు ఫ్రాంఛైజీ క్రికెట్ వ్యవహారాలూ చూసుకుంటుంటారు. అలానే పలు సందర్భాల్లో టీమిండియా అపురూప విజయాలను సాధించినప్పుడు, ఆటగాళ్లను అభినందించడంతో పాటు వారికి సత్కారాలు కూడా చేస్తుంటారు. అయితే తాజాగా ఆమె.. భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ సాధించడంతో కెప్టెన్ రోహిత్ శర్మకు అత్యంత ఖరీదైన బుగాటీ కారును బహుమతిగా ఇచ్చినట్లు నెట్టింట్లో ఫొటోలు వైరల్ గా మారాయి.నీతా అంబానీ.. రోహిత్ కు కారు గిఫ్ట్ గా ఇచ్చినట్లు ఫొటోలు చక్కర్లు కొట్టడంతో, క్రికెట్ అభిమానులు ఆ ఫొటోలను మరింత షేర్ చేశారు. కానీ వాస్తవంగా ఆ వార్తలో నిజం లేదని తెలిసింది.




# పృథ్వీ షాకు చాలా కష్టకాలం నడుస్తోంది

భారత క్రికెట్ లో పృథ్వీ షాది ప్రత్యేకమైన ప్రస్థానం అనడంలో సందేహం లేదు. మరో సచిన్ టెండూల్కర్ అనుకున్న వ్యక్తి ఇప్పుడు అనామకంగా మిగిలాడు. ఎంతవేగంగా అంతర్జాతీయ యవనికలో అడుగు పెట్టాడో అంతే వేగంగా తెరమరుగైయ్యాడు. భారత్ తరఫున ఐదు టెస్టులు, ఆరు వన్డేలు, ఒక టీ20 ఆడిన షా.. ఆ తర్వాత జాతీయ జట్టు కాదు కదా.. కనీసం డొమెస్టిక్ లెవల్లో కూడా సత్తా చాట లేక పోయాడు. తాజాగా అతని గురించి షా మిత్రుడు, ఐపీఎల్ సంచలనం శశాంక్ సింగ్ వ్యాఖ్యానించాడు. తనకు 13 ఏళ్ల వయసున్నపటి నుంచి షా తనకు తెలుసని, కొన్ని కారణాల వల్ల అతని డౌన్ ఫాల్ స్టార్ట్ అయిందని వ్యాఖ్యానించాడు

సాయి సూర్య తెలుగు దిన పత్రిక
బుధవారం 19 మార్చి 2025

# షారుఖ్‌ఖాన్‌తో సుకుమార్ సినిమా?






పుష్ప ది రూల్ సినిమాతో నేషన్ వైడ్ బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు సుకుమార్. అయితే ఈ ప్రాజెక్ట్ అనంతరం సుకుమార్ ఎవరితో సినిమా చేయబోతున్నాడా అని మూవీ లవర్స్ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ సినీ వర్గాల ప్రకారం సుకుమార్ తన నెక్స్ ప్రాజెక్ట్ రామ్ చరణ్‌తో '17' చేస్తాడని అంటుండగా.. మరోవైపు 'పుష్ప 3' కథ రాసే పనిలో ఉన్నడని టాక్ వినిపిస్తుంది. ఇదిలావుంటే.. ఈ రెండు కాకుండా మరో క్రేజీ పాన్ ఇండియా కాంబో తెరమీదకు వచ్చింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్, దర్శకుడు సుకుమార్ కలిసి ఒక ప్రాజెక్ట్ చేయబోతున్నారని ప్రస్తుతం వార్తలు వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు కలిసి ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ కోసం చేతులు కలపబోతున్నట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే సుకుమార్ పేరు బాలీవుడ్‌లో మారుమోగడం ఖాయం. రూరల్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథతో ఈ సినిమా రాబోతుండగా.. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమాలో షారుఖ్ ఖాన్‌ను విలన్ పాత్రలో చూపించే ఆలోచనలో సుకుమార్ ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# బెట్టింగ్ యాప్ వ్యవహారం...

## నిధి అగర్వాల్ పైనా కేసు తప్పదా...?



**ప్రజల ఉసురు తీస్తున్న బెట్టింగ్ యాప్ లు**

**బెట్టింగ్ యాప్ లకు ప్రచారం చేస్తున్న యూట్యూబర్లపై కేసులు**

**జీత్ విన్ అనే యాప్ కు నిధి అగర్వాల్ ప్రచారం**


సోషల్ మీడియాలో కనిపిస్తున్న వీడియోలు డబ్బుకు ఆశపడి బెట్టింగ్ యాప్స్ మాయలో పడి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు తెలిసిందే. అయితే, బాధ్యతగా ఉండాల్సిన యూట్యూబర్లు, ప్రముఖులు బెట్టింగ్ యాప్స్ కు ప్రచారం చేస్తుండడంపై తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తీవ్ర స్థాయిలో పోరాటం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు యూట్యూబర్లపై కేసులు నమోదయ్యాయి. కాగా, ప్రముఖ హీరోయిన్ నిధి అగర్వాల్ కూడా 'జీత్ విన్' అనే యాప్ ను ప్రమోట్ చేస్తున్నట్టు సోషల్ మీడియాలో వీడియోలు దర్శనమిస్తున్నాయి. ఇది కూడా బెట్టింగ్ యాప్ అని, నిధి అగర్వాల్ ప్రమోట్ చేస్తోందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని నెటిజన్లు కోరుతున్నారు. మరి, అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో చూడాలి.

# వరుస సినిమాలతో స్పీడ్ పెంచిన రితికాసింగ్



చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. విక్టరీ వెంకటేశ్ నటించిన గురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రితికా సింగ్. ఈ మూవీ తర్వాత అంతగా ఆఫర్స్ రాలేదు.. తెలుగులో పెద్దగా కనిపించక పోయినా తమిళ్ లో సినిమాలు చేస్తుంది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు తెలుగుతోపాటు తమిళం, మలయాళం చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంటుంది. గురు సినిమా తర్వాత తర్వాత విజయ్ సేతుపతితో కలిసి ఆండవన్ కట్టలై, అలాగే రాఘవ లారెన్స్ సరసన శివలింగ సినిమాల్లో నటించింది రితిక. ఈ రెండు చిత్రాలు కూడా హిట్ గా నిలిచాయి. గురు తర్వాత నేరుగా మరే తెలుగు సినిమాలోనూ నటించలేదు రితిక. కేవలం నీవెవ్వరో అనే సినిమాలో కనిపించింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా రజనీకాంత్ వెట్టయాన్ సినిమాలో నటించింది. వెట్టయాన్ చిత్రంలో కీలకపాత్ర పోషించింది. ఇందులో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ఆకట్టుకుందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే.. రితిక సోషల్ మీడియలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ చేసే వర్కౌట్లకు అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతుంటారు. అలాగే కొన్ని క్రేజీ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది ఈ వయ్యారి భామ. తాజాగా రితిక షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.

# మహేష్‌బాబు సినిమాలో ప్రియాంకచోప్రా క్యారెక్టర్ లీక్..?



దర్శకధీరుడు రాజమౌళి, మహేష్ బాబు కాంబోలో ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ29 అనే చిత్రం స్లో అండ్ స్టడీగా చిత్రీకరణ జరుపుకుంటుంది. ఒడిశాలో ఈ మూవీ షూటింగ్ జరుపుకుంటున్నట్టు తెలుస్తుండగా, అక్కడ షూట్ ప్రారంభించిన మొదటి రోజే ఓ వీడియో లీక్ అయింది. జక్కన్న తీసిన సీన్స్ అన్ని లీక్ కావడంతో ఆయన షూటింగ్‌లో ఇప్పుడు చాలా స్ట్రిక్ట్ యాక్షన్ అమలు చేస్తున్నట్టు తెలుస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తుంది. ఇందులో ప్రియాంక చోప్రా ముఖ్య పాత్ర పోషిస్తుండగా, ఆమెని నెగెటివ్‌గా జక్కన్న చూపించబోతున్నట్టు సమాచారం. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా అధికారిక ప్రకటన రాని నేపథ్యంలో ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. రాజమౌళి సినిమా అంటే ట్విస్ట్‌లు మాములుగా ఉండవు. ఏది చేసిన కూడా అది సంచలనమే అవుతుంది. ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ వార్తలలో నిజమెంత ఉందనేది తెలియాల్సి ఉంది. ఇక రాజమౌళి తన సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు కేవలం నటన, టెక్నికల్ అంశాల్లోనే కాకుండా సెట్ లో క్రమశిక్షణ మరియు పర్యావరణంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనే విషయం మనకు తెలిసిందే. ఇది మరో సారి వెల్లడైంది. మహేష్ తో షూటింగ్ చేస్తున్న ఆ లోకేషన్ లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించారు. కఠిన నిబంధనలతో షూటింగ్ ఈ మూవీ సెట్ లో రాజమౌళి అమలు చేస్తున్నట్లు తెలుస్తుంది. హీరో మహేష్ బాబుకు ఇద్దరూ ప్రియాంక చోప్రా కు ఇద్దరు అసిస్టెంట్లకు మాత్రమే లొకేషన్లో పర్మిషన్ ఇవ్వగ మిగతా ఆర్టిస్టులకు ఒక్కొక్కరికి ఒక అసిస్టెంట్ మాత్రమే అనుమతిచ్చారట జక్కన్న. నిజానికి ప్రియాంక చోప్రా కు మేకప్ మరియు వ్యక్తిగత సహాయకులగా దాదాపు 13 మంది ఉంటారు కానీ ఈ సెట్లో కేవలం ఇద్దరికీ మాత్రమే అనుమతి ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# అభినయకు కాబోయే భర్త విశాల్ కాదు..కార్తీక్



తమిళనాడుకు చెందిన అభినయ తెలుగు ప్రేక్షకులకి కూడా చాలా సుపరిచితం. అభినయ మొదటి తెలుగు సినిమా 2009లో వచ్చిన "నాడోడిగల్" మలయాళ సినిమాకు రీమేక్ అయిన "శంభో శివ శంభో". రవితేజ హీరోగా వచ్చిన శంభో శివ శంభో సినిమాలో అవకాశం దక్కించుకొని చాలా ఫేమస్ అయింది. అలానే సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో మహేష్ బాబు, వెంకటేష్ ల సోదరిగా కూడా నటించి ప్రశంసలు అందుకుంది. ఆమె నటనతో ఎంతోమంది ప్రేక్షకులను మెప్పించారు. కింగ్, దమ్ము, ధ్రువ, సీతా రామం, గామీ తదితర తెలుగు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకి చాలా దగ్గరైన అభినయ .. మార్క్ ఆంటోనీ వంటి డబ్బింగ్ సినిమాలతోనూ తెలుగు ఆడియెన్స్ ని మెప్పించింది. దీంతో అభినయ పెళ్లి చేసుకోబోయే వ్యక్తి ఎవరు, ఆయన బ్యాక్‌గ్రౌండ్ ఏంటి అనే విషయాల గురించి ఆరాలు తీసారు. కొందరైతే విశాల్‌తో ఈ అమ్మడి వివాహం జరగబోతుందంటూ ప్రచారాలు చేశారు. కాని అభినయ కు కాబోయే భర్త పేరు కార్తీక్. కొద్ది రోజుల క్రితం ఇతని పుట్టిన రోజు సందర్భంగా ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను షేర్ చేసి అందరిలో ఉన్న అనేక అనుమానాలని పటాపంచలు చేసింది.కార్తీక్.. హైదరాబాద్‌కి చెందిన వ్యక్తి కాగా, ప్రముఖ బిజినెస్ మ్యాన్ అని తెలుస్తోంది. హైదరాబాద్‌లోనే అతను పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక అభినయతో అతనికి 15 సంవత్సరాల నుంచే పరిచయముందని, ఇద్దరూ ప్రేమలో కూడా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారట. మరి పెళ్లి తేది ఎప్పుడు ప్రకటిస్తుందో చూడాలి. ఏది ఏమైన అభినయ పెళ్లి పీటలు ఎక్కుతున్ననేపథ్యంలో ఆమెకి ప్రముఖులు, నెటిజన్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

Printed Published and owned by Polagoni Rajesh Printed at PMRPublications, Ranga Reddy (Dist), Telangana 50150. at H.No 4-136/12,Journalist colony, Turkayamjal,Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh. www.sai suryaadaily.com